జలవనరులను కలుషితం కానివ్వొద్దు...

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: సకల జీవరాశులకు అవసరమైన జలవనరులను కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్-6, ఆర్ఎడబ్ల్యూఎస్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం నీటి వినియోగంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నీటిని దుర్వినియోగం చేస్తే మిగిలేవి కన్నీళ్లేనని చెప్పారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, ఎస్వో డాక్టర్ ఎస్.సామ్రాజ్యలక్ష్మి, ఆర్ డబ్ల్యూఎస్ డీఈఈ ఎ.మురళీమోహన్. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ. పీవో బి.విణు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎచ్చెర్లలో నిర్వహించిన ర్యాలీలో వర్సిటీ అధికారులతో పాటు మాజీ సర్పంచ్ మెండ రాజారావు, మాజీ ఉప సర్పంచ్ మూకళ్ల భాస్కరరావు, నిడిగింట్ల రమణ, నిడిగింట్ల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు మాన్యువల్ కౌన్సిలింగ్ లో జరపాలి

ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ



విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎన్నో ఏళ్ల నుండి వెబ్ కౌన్సిలింగ్ వద్దని వెబ్ ఆధారిత బదిలీలు పట్ల మాకు నమ్మకం లేదని మ్యాన్యువల్ కౌన్సిలింగ్ విధానమేకావాలని రాష్ట్రంలో లక్షలాది మంది ఉపాధ్యాయులు గగ్గోలుపెడుతున్నా విద్యాశాఖ ఉన్నతాధి కారులు తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఇప్పుడు విడుదల చేసిన డ్రాఫ్ట్ లో కూడా వెబ్ ఆధారిత కౌన్సిలింగ్ విధానమే ఉంటుందని తెలియజేయడాన్ని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ ఖండించారు. స్థానిక ఎన్ ఆర్ దాసరి క్రాంతి భవన్ లో మంగళవారం బదిలీల చట్టం, డ్రాఫ్ట్ పై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జి. రమణ మాట్లాడుతూ వెబ్ కౌన్సిలింగ్లో వేలాది ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు అయితే ఒక జిల్లాలో 3,500 నుండి 5వేల సంఖ్య వరకు సీనియారిటీ లిస్టు ఉంటుందని ఆ సీనియార్టీలో చివర ఉన్నటువంటి వ్యక్తులు 4వేల వరకూ పాఠశాలకు ఆప్షన్స్ ఇవ్వడం దాదాపు అసాధ్యమని ఇది తీవ్ర ఒత్తిడితో కూడిందన్నారు. ఇంత గందరగోళం, ఇంత మనోవేదన ఉపాధ్యాయుడికి ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 98 వేల మంది ఎస్జీటీ లు వెబ్ కౌన్సలింగ్ వద్దని గగ్గోలు పెడుతున్నా వినిపించుకోకుండా విద్యాశాఖాధికారులు ఎవరి ప్రయోజనాలు కోసం వెబ్ కౌన్సలింగ్ లో బదిలీలు చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా కూటమినేతలు కలుగజేసుకొని ఉన్నతాధికారులు ఒంటెద్దు పోకడలను నిలువరించకపోతే దానికి తగిన మూల్యం చెల్లించు కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హాజరైన కార్యవర్గ సభ్యులు వివధ మండలాలు నాయకులు పలువురు ఉపాధ్యాయులు డ్రాఫ్ట్ చట్టంపై ఉన్న అభ్యంతరాలను ప్రొఫార్మాలో నింపి పాఠశాల విద్యాశాఖకు మెయిల్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ,కె.శ్రీనివాసరావు, జి. శ్రీను, ఎం.తేజ,చింతల రామారావు, చౌదరి జగన్ వివధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురౌతున్న 'నరసన్న చెరువు'


చదును చేసిన చెరువు స్థలం

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక ఆర్.టి.సి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న నరసన్న చెరువు రోజు రోజుకి ఆక్రమణలకు గురౌతుంది. గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెం-94లో సుమారు 17.35ఎకరాలున్న ఈ చెరువు గతంలో వ్యవసాయ భూములకు సాగునీరు అందించేది. అయితే ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజల స్వార్ధానికి మూడు భాగాలుగా నేడు ఈ చెరువు విడిపోయింది. సర్వే నెం-94-1లో 6.32ఎకరాల్లో ఎన్.హెచ్-16స్మశానాకి స్థలం, పలు ఆక్రమణలకు గురికాగా, సర్వే నెం-2లో ఎన్.హెచ్-16 రహదారి నిర్మాణం జరుగగా, సర్వే నెం-3లో 94-3కొంత భాగం ఇండోర్ స్టేడియం నిర్మాణం, టాక్సీ, వ్యాన్, ఆటోలు నిలుపుకునేందుకు స్థలాన్ని ప్రజా ప్రతినిధుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. ఇలా ఎవరి పలుకుబడి ఉపయోగించుకొని వారు ఆక్రమించుకోగా, ఈ చెరువులో కొంత భాగం స్థానిక పచోరినగర్ కాలనీకి చెందిన వ్యక్తులు ఆక్రమణ చేసుకున్నారు. ప్రస్తుతం పచోరి కాలనీ చివర చెరువు భాగంలో సుమారు 25సెంట్ల స్థలంలో ఇళ్ళు కూల్చిన వ్యర్ధాలను వేసి, చదును చేశారు. ఈ విషయమై పంచాయితీ, రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అంబావిల్లి పాఠశాల లో ఉత్తమ విద్యా బోధన..

ఎంఈఓ రాంబాబు...



విశాలాంధ్ర-హిరమండలం: మండలంలోని అంబావిల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు ఉపాధ్యాయులు చాలా చక్కగా విద్యా బోధన నిర్వహిస్తున్నారని మండలవిద్యా శాఖాది కారి కిలారి రాంబాబు విలేకరుల కు తెలిపారు. మంగళవారం అంబావిల్లి గ్రామం లోని ప్రభుత్వపాఠశాల ను ఎం ఈ ఓ రాంబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల కు సంబందించిన రిజిస్టర్, రికార్డ్ లను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల కు సమ్మెట్ 4 పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. విద్యా లో వెనుక బడి ఉన్న విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులు ను ఆదేశించారు. విద్యార్థుల తో కలసి ఎం ఈఓ భోజనం చేసి భోజనం చాలా చాలా బాగుంది ఇలా నే అన్ని పాఠశాల ల్లో వండితే బాగుంటుంది అని అన్నారు. ఉపాధ్యాయులు లంక వెంకట్ రమణ, ఉపాధ్యాయులు, ఎస్ ఆర్ పి గోవిందా రావు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టరు ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ,జిల్లా అధికారులతో కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో కలెక్టర్ కార్యాలయం నుండి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు ముందస్తు అనుమతి లేకుండా సెలవు పై వెళ్ళిన సెక్రటేరియట్ సిబ్బంది సెలవులను సంభందిత జిల్లా అధికారులు రెగ్యులరైజ్ చేయరాదన్నారు. 90 శాతం కన్నా సచివాలయ సిబ్బంది హాజరు తగ్గరాదని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులు లక్ష్యాలు సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పి ఎం ఎ వై 2.0 దరఖాస్తు చేసుకున్నవారు 41862 మంది ఉన్నట్లు హౌసింగ్ పతక సంచాలకులు నగేష్ తెలియజేశారు.ప్రభుత్వ ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం తో నిర్వహిం చే కార్యక్రమాలకు సంభందించి సర్వే 8 నుండి 18 లోపు పూర్తి చేయాలని,



నిరుపేదలును గుర్తించ దానికే ఈ సర్వే ఉపయోగ పడుతుందని వివరించారు. ఐవి ఆర్ ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం), క్యు ఆర్ కోడ్ , కాల్స్ వంటి విధానాల ద్వారా సర్వే ల లో సానుకూల ప్రజా దృక్పథం రావాలని, ప్రజా సానుకూల దృక్పథంలో మంచి ఫలితాలు కొరకు ప్రతి శాఖ నోడల్ అధికారిని నియమించాలని తెలిపారు. వేసవిలో త్రాగు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సిపిఓ లక్ష్మి ప్రసన్న, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, డిఆర్డిఏ పీడి కిరణ్ కుమార్, హౌసింగ్ పీడి నగేష్, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్ తదితరులు హాజరయ్యారు.

ఘనం గా 54వ జాతీయ భద్రతా దినోత్సవం దినోత్సవం



విశాలాంధ్ర-రణస్థలం: మండలం పైడిభీమవరం లో శ్రేయాస్ పరిశ్రమలో పనిచేసే 1000 మంది కార్మికులు మరియు భద్రత అధికారులు పెద్దఎత్తున భద్రతపై అవగాహన కల్పించడం కోసం పైడి భీమవరం పరిశ్రమ ఏరియాలో 54వ జాతీయ భద్రతా దినోత్సవం మంగళవారం ఘనం గా జరిగింది. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అన్ని కర్మాగా రాలు అపిటోరియా, డాక్టర్ రెడ్డిస్, ఆరో యాక్టివా, ఏటిఎల్, అపర్ణ, ఎస్ ఎ సి ఎల్, దీపక్ నైట్రేట్, ఫ్రింజె, భద్రత ర్యాలీ నిర్వహించారు. ఈ భద్రతా ర్యాలీ డాక్టర్ రెడ్డిస్ నుండి అపిటోరియా యూనిట్ -4 వరకు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు మాట్లాడుతూ భద్రత యొక్క ప్రాముఖ్యత గురించి వి అరించారు. ఈ రోజు భద్రత ర్యాలీలో కార్మికులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే భద్రత అనేది మన నిత్యజీవితంలో మరియు కర్మగారంలో ప్రాముఖ్యతను ఇస్తూ ఎటువంటి ప్రమాదాలు గురికాకుండా కార్మికులు తమ కర్తవ్యం నిర్వహించాలి అని కోరారు, కార్మికుల భద్రత, శ్రేయస్సు భారతదేశ అభివృద్ధికి చాలా అవసరమని నొక్కి చెప్పారు. ఈ ర్యాలీకి అపిటోరియా యాజమాన్యం సహయ సహకారాలు అందించడము జరిగింది. ఈ కార్యక్రమంను హెచ్ ఆర్ హెడ్ కమలాకర్ రెడ్డి మరియు ఈఎహెచ్ఎస్ హెడ్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రతి మహిళా ఉద్యోగి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వాటిని సామాన్య ప్రజలకు చేరేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. ఐసిడిఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగు లకు ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, వాటికి విధిస్తున్న శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర కోసం పోరాటం లో పాల్గొన్న సరోజినీ నాయుడు అన్నారు. సరోజినీ నాయుడు సమాజానికి మంచి సందేశం ఇచ్చిన మహనీయురాలు అన్నారు. నేడు సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై చట్టాల కనుగుణంగా పోలీసులు విచారణ చేపట్టాలన్నారు. స్వాతంత్ర కోసం పోరాటం లో పాల్గొన్న సరోజినీ నాయుడు అన్నారు. సరోజినీ నాయుడు సమాజానికి మంచి సందేశం ఇచ్చిన మహనీయురాలు అన్నారు. కొత్త చట్టాలు వివరించారు. ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ అధికారిణి శాంతిశ్రీ మాట్లాడుతూ గృహ హింస నుండి మహిళల రక్షణ చట్టం 2005 అక్టోబర్ 26, 2016 నుండి అమల్లోకి వచ్చింది. భర్త లేదా పురుష లైవ్-ఇన్ భాగస్వామి లేదా అతని బంధువుల చేతుల్లో హింస నుండి భార్య లేదా మహిళా లైవ్-ఇన్ భాగస్వామికి రక్షణ కల్పించడం ఈ చట్టం లక్ష్యం. దత్తత తీసుకున్న సోదరీమణులు తల్లులతో సహా సోదరీమణులైన మహిళలకు చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. సమాజ సేవకులు హరికా ప్రసాద్, పిఓఐసి మెట్ట మల్లేశ్వర రావు, బాల్య వివాహా చట్టంలో ఉన్న పలు అంశాలు వివరించారు. బాల్య వివాహలు చేయడం నేరం, బాలికలకు మానసిక పరిపక్వం వచ్చిన తరువాతే వివాహం చెయాలి, బాలికలో పూర్తి స్థాయిలో అవయువాలు పరిపక్కవత చెందవు. లేకపోతే బాలిక చాలా అనారోగ్యానికి గురి అవుతారు, అంతేకాక పుట్టేపిల్లలలో పలు లోపాలు ఉత్పన్నమవుతాయన్నారు. బాల్య వివాహలకు పాల్పడుతున్న బాలిక, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వ హించి అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహలు చేయడం వలన వచ్చే పలు సమస్యలు వివరించారు. అవగాహనకి విభిన్న ప్రతిభావంతులు ప్రాజెక్ట్ అధికారిణి కవితా, ఐసిడిఎస్ నోడల్ అధికారిణి మణెమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లక్ష్మి, పిఓఐసి మెట్ట మల్లేశ్వర రావు, పిఓఎస్ఐసి లక్ష్మునాయుడు, న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, ఐసిడిఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో ప్రధమ విజేతగా నిలిచిన జెస్సి కబడ్డీ బృందం

విశాలాంధ్ర-పలాస: మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన యువజన సంఘం 71వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలలో జెస్సి కబడ్డీ బృందం ప్రధమ స్థానం కైవసం చేసుకుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే ద్వితీయ స్థానంలో మందస మండలం బాహడపల్లి గ్రామానికి చెందిన కబడ్డీ బృందం, తృతీయ స్థానం వైజాగ్ వారియర్స్ బృందం, నాలుగో స్థానం విజయనగరం కబడ్డీ బృందం కైవసం చేసుకున్నారు. ప్రథమ బహుమతిగా రూ. 40,000, షీల్డ్ ద్వితీయ బహుమతిగా రూ. 30,000, తృతీయ బహుమతిగా రూ. 20,000, నాలుగవ బహుమతిగా రూ.10,000 లతో పాటు షీల్డ్ లు అందజేశారు. జెస్సి ఈవెంట్స్ కు శ్రీ కామేశ్వర ఎర్త్ మూవర్స్ ఎం.డి కిక్కర ఢిల్లీరావు, ద్వితీయ బహుమతిని అండమాన్ కు చెందిన ప్రవాసాంధ్రుడు బొడ్డు రామారావు, తృతీయ బహుమతిని పద్మనాభపురం గ్రామానికి చెందిన కొండే యుగంధర్, నాలుగో స్థానం పొందిన విజేతకు అమరావతి హోటల్ నిర్వాహకులు కరగాన కుమార్ లు స్పాన్సర్ చేశారు. ఇక బెస్ట్ అవార్డ్స్ బెస్ట్ రైడర్ విజయనగరం వాసి ప్రసాద్ గెలుచుకోగా ఈయన ప్రో కబడ్డీ లీగ్ లో తెలుగు టైటాన్స్ కు ఎంపిక కావడం గమనార్హం. అలాగే బెస్ట్ డిఫెండర్ బహడపల్లి గ్రామానికి చెందిన కోట పవన్, బెస్ట్ ఆల్ రౌండర్ గా జెస్సీ కబడ్డీ బృందం సభ్యుడు పవన్ దక్కించుకున్నాడు. అలాగే మ్యాచ్ రిఫరీస్ మరియు ఆల్ ఆఫీసియల్స్ కు వ్యక్తిగత అవార్డ్స్ బహుకరించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. బహుమతుల ప్రధాన ఉత్సవ కార్యక్రమంకు సంఘం అధ్యక్షులు క్రాంతి కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పలాస నియోజకవర్గం సమన్వయకర్త వెంకన్న చౌదరి, టిడిపి నాయకులు లోడగల కామేష్ యాదవ్, కిక్కర ఢిల్లీరావు, అన్నదాత రైతు సంఘం అధ్యక్షులు రాజాం శ్రీనివాస్, రాజాం గుణవంతు, బత్తిని వాసు, బొడ్డు సింహాద్రి, సైనిక్ యూనియన్ అధ్యక్షులు తామాడ రామారావు, మాజీ తామాడ త్రిలోచనరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పోతనపల్లి గీతమ్మ, స్త్రీ విముక్తి మహిళా సంఘం అధ్యక్షురాలు రాజాం పద్మ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గర్తం తులసిరావు, బొడ్డు దుష్యంత్, యువజన సంఘం ఉపాధ్యక్షులు గుజ్జు దశరథ రావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు జగన్, కోశాధికారి తామాడ గంగయ్య,మాజీ అధ్యక్షులు నౌగాపు గంగాధర్,గేదెల జానికిరావు,బచ్చల శంకర్, జైభీమ్ సభ్యులు పోతనపల్లి గణపతి, గర్తం ఈశ్వర్, పత్తిరి తాతారావు, బొడ్డు దుష్యంత్, గుజ్జు దుష్యంత్, పోతనపల్లి తాతారావు, కుత్తుమ్ హేమలయ్య,బుడత బాలరాజు, సార జోగారావు, కోనేరు లోకేష్, బైనపల్లి గణపతి,బుడత కాంతారావు, రాజాం జానికిరావు,తామాడ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గాదె విజయం ఉపాధ్యాయుల విజయమే ...!

పూలే టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు భూపతి రావు

విశాలాంధ్ర-పొందూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఘనవిజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడుకు పూలే టీచర్స్ ఫెడరేషన్, శ్రీకాకుళం జిల్లా నాయకులు బొడ్డేపల్లి భూపతిరావు అభినందనలు తెలిపారు. గాదె విజయం ఉపాధ్యాయుల విజయమని కొనియాడారు. ఆయన ముచ్చటగా మూడవసారి గెలవడం ఆయన చిత్తశు ద్ధికి ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని అన్నారు. ఎప్పుడూ ఉపాధ్యాయులు మధ్యనే ఉంటూ ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయడమే ఆయన విజయ రహస్యమని అన్నారు.ఆయన ఎమ్మెల్సీగా ఉన్న కాలంలోనే ఉపాధ్యాయుల సమస్యలు ఎన్నో పరిష్కరించారని, ఏ ప్రభుత్వాలు ఉన్నా ఉపాధ్యాయుల ఉమ్మడి సమస్యలను ప్రభుత్వ దృష్టిలో పెట్టి ఆ సమస్యలను పరిష్కరించే వరకు అలుపెరగకుండా ప్రయత్నించారని, సమస్యలను పరిష్కరించడంలో ఆయనకు ఆయనే సాటి అని, ఈ మాట ఉపాధ్యాయ లోకంలో ఎవరిని అడిగినా చెబుతారు అని అన్నారు. ఒక ఉపాధ్యాయునిగా విద్యావ్యవస్థ పట్ల, ఈ వ్యవస్థలో ఉన్న సమస్యలు పట్ల ఈయనకు సమగ్రమైన అవగాహన ఉందని, అందరి ఉపాధ్యాయులతో ఆత్మీయమైన అనుబంధం ఉన్నదని, ప్రతీ చిన్న సమస్యకు ఆయన స్పందిస్తారని, చిన్న,పెద్ద, తన, పర అనే తారతమ్యం లేకుండా అందరినీ గౌరవించి కలుపుకుపోయే స్వభావం కల కార్యశీలి అని, గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపు విద్యావ్యవస్థలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి గొప్ప అవకాశం అని కొనియాడారు.

యాదవులను బీసి బిలో చేర్చాలి

ఎమ్మెల్సీ నర్తు రామారావు



విశాలాంధ్ర-కవిటి: ఉత్తరాంధ్రలో ఉన్న యాదవులను తూర్పు యాదవులుగా భావించి వారికి బిసి-బిలో చేర్చాలని ఎమ్మెల్సీ నర్తు. రామారావు అన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో బిసి కమిషన్ కార్యాలయంలో కమిషనర్ శంకర్ నారాయణకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వున్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలో ఉన్న యాదవులంతా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నారు. వీరంతా గొల్లలుగా పిలువబడి, పశువులు, గొర్రెలు, మేకలు కాపార్లుగా ఉంటూ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కుల వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరందరికీ బిసి-డి నుంచి తొలగించి బిసి-బిలో చేర్చాలని కోరారు. దీనిపై కమిషన్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అసెంబ్లీలో బడ్జెట్ పై మాట్లాడిన ఎమ్మెల్యే ఎంజీఆర్



విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: 2025-26 బడ్జెట్ 3,22,355 కోట్లతో ప్రవేశపెట్టడం చాలా హర్షణీయంగా ఉందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలియజేశారు. మంగళవారం అసెంబ్లీ లో ఎమ్మెల్యే మామిడి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలన వైఫల్యం వలన అన్ని వ్యవస్థలు నిర్వీర్యమై,అప్పుల భారంతో రాష్ట్రం 1947 వలె ఆర్థిక మరియు సామాజిక పరిస్థితుల్లోకి వెళ్లిపోయిందని ఎమ్మెల్యే ఎం జి ఆర్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వర్ణాంధ్ర 2047 వైపు పది సూత్రాలతో ముందుకు సాగిపోవాలంటే ఎంతో శ్రమ, నైపుణ్యం, ఓర్పుతో ముందుకు పోవాలని ప్రస్తుత బడ్జెట్లో విద్య (3,185కోట్ల), వైద్యం (2,506కోట్లు), వ్యవసాయానికి (19, 264కోట్లు) పెద్దపీట వేయడం చాలా హర్షనీయమని ప్రతి కుటుంబానికి 25 లక్షల వరకు ఆరోగ్య భీమా కల్పించడం సర్వత్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని గత ప్రభుత్వ దాష్టీకానికి కష్ట,నష్టాలకు గురైన బీసీల సంక్షేమానికి భారీ నిధులు (47,456కోట్లు) కేటాయించడం ప్రభుత్వానికి బీసీలు పట్ల ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతొం దని గత ప్రభుత్వం బడ్జెట్ అనే అంకెల గారిడి వలన గత ఐదు సంవత్సరాలు ప్రజలు ఏమి కోల్పోయారు. అర్థం చేసుకున్నారు. అన్ని సామాజిక వర్గాల అభివృద్దే ధ్యేయంగా, సంక్షేమానికి సూపర్ సిక్స్ పథకాల నిలిపి నెరవేరుస్తూ ముందుకు వెళుతున్న ఈ బడ్జెట్ ని ప్రజలు స్వాగతిస్తున్నారని ఎమ్మెల్యే గోవిందరావు అసెంబ్లీ లో మంగళవారం అన్నారు.

వృధా అవుతున్న తాగునీరు... వీధి రోడ్డు జలమయం

విశాలాంధ్ర-జలుమూరు: మండల కేంద్రం సారవకోట కుళాయిల ద్వారా నీటి సరఫరా వృధా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ అసలే నీటి కొరత ఆపై కొళాయిలు నేరుగా నీరు సరఫరా అవుతుండడంతో చాలా సమయాల్లో నీరు వృధా అవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మేదర వీధిలో నీరు వృధా కావడం వలన అక్కడ వీధిలో నీరు చేరి జలమయం అవుతుందని ఆ ప్రాంతంలో కాలువ లేనందున రోడ్డు బురదగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. కుళాయిలకు పైపులు వేసి నీరు వృధా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఇటువంటి చిన్న చిన్న సమస్యలను కూడా పాలకులు అధికారులు పట్టించుకోవడమే జరుగుతుందని విమర్శ లూవినిపిస్తున్నాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



విశాలాంధ్ర-మెళియాపుట్టి: ఫోర్ వీలర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మెళియపుట్టి మండల కేంద్రంలో మంగళవారం వేకువజామున చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసుల వివరాలివి. మంగళవారం ఉదయం సుమారు నాలుగు గంటల సమయంలో ఒడిశా రాష్ట్రం భిన్నాల గ్రామానికి చెందిన మదన్మోహన్ జెన్నా(52) ప్రతిరోజు మాదిరిగా వ్యక్తిగత పని నిమిత్తం తన గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులతో కలిసి మెళియాపుట్టికి వస్తున్న నేపథ్యంలో వర్లాకిమిడికి వెళ్లే మూడు రోడ్ల కూడలికి సమీపంలో గుర్తు తెలియని వాహనం వేగంతో వెనుక నుంచి వచ్చి ఢీ కొనడంతో ప్రమాదం సంభవించిందని, దీంతో ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు మదన్ మోహన్ జెన్న భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరు పరిశీలించడం తోపాటు పలు వివరాలను స్థానికులకు అడిగి తెలుసుకున్నారు. శవ పంచినామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న ఒక పాల వ్యాను ఢీకొన్నట్టుగా పలువురు చర్చించుకుంటున్నారు. మృతుడికి భార్యా, ఇద్దరు కుమార్తెలున్నట్లు తెలుస్తుంది. వ్యక్తిగత పని నిమిత్తం వచ్చి అకాల మృతి చెందటం పట్ల కుటుంబీకులు, గ్రామస్తులు తీవ్రంగా రోధిస్తున్నారు.

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ

విశాలాంధ్ర-పలాస: పలాస మండలం బొడ్డపాడు స్మారక భవనం ఆవరణలో మంగళవారం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు వి.శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి యన్.మూర్తి. సిపిఐ యం యల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు,, కేంద్ర కమిటీ సభ్యులు నాగమణి, సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, రాష్ట్ర నాయకులు హరనాథ్, సత్యన్నారాయణ, కిరణ్ మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు..ఈ కార్యకర్తల సమావేశానికి కడప, అన్నమయ్య, ఎన్టీఆర్, తూర్పు గోదావరి, వెస్ట్ గోదావరి, విశాఖ,మన్యం జిల్లా, గుంటూరు, శ్రీకాకుళం జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే కార్యకర్తల సమావేశంలో దేశం పరిస్థితులకు తగినట్లుగా పార్టీ ఎత్తుగడలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.దేశంలో బూర్జువా పార్టీల పరిస్థితులు,, అలాగే దేశంలో మూడు ప్రవాహాలు గా ఉన్న కమ్యూనిస్ట్ పార్టీ లు సిపిఐ, సిపిఎం, సిపిఐ మావోయిస్టు, అలాగే సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీగా వీటి మధ్య ఉన్న తేడాలు, విధానాలపై, పార్టీ నిర్మాణంపై పూర్తి స్థాయిలో కార్యకర్తలకు శిక్షణ ఇవ్వటం జరిగిందని పార్టీ నాయకులు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, ఎఐకేయం జిల్లా నాయకులు మద్దిల రామారావు ఎఐసిసిటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

8న ఒంగోలులో జరిగే పీవో డబ్ల్యూ సంస్థల రాష్ట్ర విలీన సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పలాస: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 8న జరగనున్న రెండు పిఓడబ్ల్యూ సంస్థల రాష్ట్ర విలీన సభను విజయవంతం చేయాలని శ్రీకాకుళం జిల్లా రెండు సంస్థల అధ్యక్షులు కృష్ణవేణి, ఈశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలు హేమక్క, పిఓడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, కోశాధికారి బర్ల జానకిలు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో సంస్థ సభ్యులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఫాసిజం ముదురుతున్న వేళ చీలికలకు గురైన మహిళా సంస్థలు, భావ సారూప్యత కలిగిన మహిళా సంఘాలు ఐక్యమై పని చేయాల్సిన చారిత్రక సమయం ఆసన్నమైందని, ఈ కర్తవ్యంలో భాగంగానే మార్చి 8న ఒంగోలులో నిర్వహిస్తున్న రెండు పిఓడబ్ల్యుల విలీన సభను విజయవంతం చేయాలని రెండు పీవోడబ్ల్యూ సంఘాలు ఉమ్మడిగా కోరాయని అన్నారు. విలీన సభకు అధిక సంఖ్యలో మహిళలు తరలి రావాలని, అన్ని రకాల సహాయ సహకారాలను అందజేయాలని వారు కోరారు. హిందుత్వ ఫాసిజం పెరుగుతూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ మహిళల హక్కులను పాలకులు కాలరాస్తున్న నేపథ్యంలో సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వం కోసం మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా జరపాలని వారు పిలుపునిచ్చారు. మహిళలు సంఘటితంగా పోరాడుతు న్నప్పటికీ వారి మీద లైంగిక హింస పెరుగుతూనే ఉందని ఆవేదన చెందారు. రెజ్లర్ల దీర్ఘకాలిక ఉద్యమం, హాత్రాసులో దళిత బాలికపై జరిగిన అత్యాచారం, మణిపూర్ లో గిరిజన మహిళలపై జరిగిన అమానుష హత్యలు, ఇటీవల బెంగాల్ లో పీజీ డాక్టర్ పై జరిగిన అత్యాచారం ఇలా రోజురోజుకు స్త్రీలపై పెరుగుతున్న హింసను గుర్తు చేస్తున్నాయన్నారు. ఒక వైపు స్త్రీని దేవతని సహనమూర్తి అని మహిళా శక్తి అంటూ ప్రేమను ఒలకబోస్తూ మరో వైపున వారి మీద వ్యవస్థీకృత హింసను ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు సంఘటితంగా పోరాడాలని సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వం పోరాటం మహిళల హక్కు అని వారు గుర్తు చేశారు. రెండు పీవోడబ్ల్యూలు కలిసి భవిష్యత్తులో ఒకే సంస్థగా ఏర్పడి మహిళా సమస్యల ప్రాతిపదికగా ఉద్యమం తీవ్రతరం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆవిష్కరణ సభలో రెండు జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు పి.ఓ.డబ్ల్యు రెండు సంస్థల కు చెందిన సైన కళావతి, తెప్పల మహిళా సంఘ సభ్యులు బత్తిని ఉమ, బత్తిని సాయమ్మ, మల్లెల వెంకటమ్మ, గేదెల పూర్ణావతి, పోతనపల్లి హేమావతి, సైన ధనలక్ష్మి, కుత్తుం ధనలక్ష్మి, మోహినమ్మ తదితర పీవోడబ్ల్యూ ప్రతినిధులు పాల్గొన్నవారు.

అదనపుబిల్లులు వసూళ్ళపై ఐఓఎల్ అధికారుల విచారణ


మహిళలనుంచి సమాచారం సేకరిస్తున్న ఐఓఎల్ అధికారి

విశాలాంధ్ర-పొందూరు: మండల కేంద్రం పొందూరు లో ఇండేన్ గ్యాస్ ఏజన్సీ సిబ్బంది అదనపు బిల్లులు వసూలు పిర్యాదుపై ఐఓఎల్ అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. అదనపు వసూళ్ళపై మూగోడువీధి మహిళలు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పౌరసరఫరాలశాఖాదికారులు, రెవెన్యూ అధికారులు ఇప్పటికే విచార ణ జరిపి కలెక్టర్కు నివేదిక ఇచ్చారు. గ్యాస్ఏజన్సీ బాధ్యతలు సైతం రణస్థలం గ్యాస్ ఏజన్సీకి తహసీల్దార్ ఆర్, వెంకటేష్ అప్పగించారు. ప్రతీ మహిళ వద్దకు వెళ్ళి వివరాలు సేకరించారు. కొంతమంది అదనపు వసూళ్ళు వాస్తవమేనని చెప్పారు. ఐఓఎల్ సేల్స్ ఆఫీసర్ నివేదికను ఐబిఎల్ ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు.

హెల్పింగ్ హాండ్స్ సభ్యులు వితరణ

విశాలాంధ్ర-కవిటి: కంచిలి మండలం ఎంఎస్.పల్లి గ్రామానికి చెందిన కుందల నరేష్ గత కొంత కాలంగా గొంతు క్యాన్సర్ బాధపడుతున్నాడు. ప్రస్తుతం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కవిటి మండలానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మంగళవారం రూ. 10 వేలు ఆర్థిక సాయంను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పైల. వెంకటు, నీలాపు వంశీ, నీలాపు. కిరణ్, దల్లి. సాయి తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ పోటీలలో కవిటి విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర-కవిటి: జాతీయస్థాయి కళా ఉత్సవ్ పోటీలలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఆరవ స్థానం కైవసం చేసుకున్నారు. ఇటీవల శ్రీకాకుళం మరియు విజయవాడలో జరిగిన జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ మరియు బ్యాండ్ పోటీలలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపిక కాబడి, భోపాల్ లో జరిగిన జాతీయస్థాయి పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఆరవ స్థానం కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కవిటి విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు పి.బి.కె శర్మ,యు గిరిబాబు,ఎన్ శర్మ లను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య,వమరవల్లి డైట్ ప్రిన్సిపాల్ అభినందిస్తూ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కవిటి మండలం విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం కే. జానకి రావు, ఉపాధ్యాయులు వి.వాసుదేవరావు, ఏ.వెంకట్రావు, ఏ.జ్యోతి కుమారి,బి.జయకృష్ణ,జి. ప్రకాష్ రావు, దీనరావు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

విశాలాంధ్ర-సోంపేట: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈ మండలం ఎకువూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి గ్రామసంఘ అధ్యక్షురాలు పుక్కల్ల ఆరేలమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో గల మహిళలతో పలు విషయాలను చర్చించారు. మహిళల అభ్యున్నతికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రతి మహిళ అవగాహన కల్పించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి ఎర్రమ్మ, కె.రూపావతి, వాసుపల్లి భూలక్ష్మి, లోలాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం వైపు మహిళలు ముందడుగు వేయాలి

విశాలాంధ్ర-సోంపేట: ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి విద్యార్థిని మంచి ఆలోచనలతో, కృషి పట్టుదలతో చదువుల్లో రాణిస్తూ ముందడుగు వేయాలని సోంపేట ఎస్సై లోవరాజు పేర్కొన్నారు. స్థానిక కొంచాడ రాజేశ్వరరావు మెమోరియల్ జూనియర్ కళాశాలలో మంగళవారం బాలికలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా బాలిక చైతన్య సదస్సును నిర్వహించారు. ఇంటర్మీడియెట్ స్థాయిలో ప్రతి బాలిక సమాజం గర్వపడేలా ఉన్నతమైన భవిష్యత్తు కోసం మంచి పట్టుదలతో కృషి చేయాలని కోరారు. మొబైల్ ఫోన్లుకు దూరంగా ఉంటూ అనవసరమైన వ్యవహారాల్లో తలదూర్చకుండా చదువే సర్వశ్వంగా భావిస్తూ చక్కని క్రమశిక్షణతో తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టులోని తప్పులను సవరించాలి

విశాలాంధ్ర - పొందూరు: జిల్లా విద్యాశాఖ కార్యాలయం విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టులోని తప్పులను సవరించాలని . 610 జీవో ద్వారా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల పేర్లు సీనియారిటీ ప్రకారం లేవన్నారు . ముఖ్యంగా 2000 డియస్సీలో సెలెక్ట్ అయి వివిధ జిల్లాల్లో నియమించబడిన ఉపాధ్యాయులు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు 610 జీవో ద్వారా బదిలీ అయినప్పుడు మొదట నియామకం పొందిన తేదీ కాకుండా చాలా మంది ఉపాధ్యాయులకు 2007 సంవత్సరం లో చేరినట్లు లిస్టులో ఉందన్నారు . దీంతో వందల్లో ఉండాల్సిన పేరు వేలల్లో ఉందని అలాగే కులము మరియు ఇతర అంశాలు కూడా తప్పుగా నమోదు చేసారని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి ప్రసన్న, ఆ సమస్త జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు లు ఓ ప్రకటనలో ఆరోపించారు . ఉపాధ్యాయుల నుంచి అప్పీల్లు స్వీకరించి తప్పులను సవరించాలని కోరుతున్నారు.

12 నుంచి ఫోటోగ్రఫీ కోర్సులో శిక్షణ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభిస్తున్న ఫోటోగ్రఫీ అండ్ వీడియో గ్రఫీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి చదివిన 19-45 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు శిక్షణలో చేరేందుకు అర్హులని చెప్పారు. నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నెం 95534 10809, 79933 40407ను సంప్రదించాలని కోరారు.

ఆద్యంతం అలరించిన శాస్త్రీయ సంగీత విభావరి

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శ్రీ చక్ర పెరుమారుల స్వామి వారి డోలోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు కార్యక్రమాన్ని పొందల నారాయణమూర్తి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎలమంచిలి కి చెందిన ఎండమూరి శికామణి భాగవతారని హరికథ గానం, అనంతరం శాస్త్రీయ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా వయోలిన్ సోలో కచేరి కార్యక్రమం చేపట్టారు. ఇందులో మావుదూరి సత్యనారాయణ శర్మ (వయోలిన్), మావుదూరు సూర్యప్రసాదరావు (మృదంగం), కే నూకరాజు (కీబోర్డ్ మరియు ఫ్లూట్), ఎం నరేష్ కుమార్ (రిథమ్ ప్యాడ్) ల ప్రదర్శన ప్రేక్షకులకు ఎంతగానో ఆకట్టుకుంది.

ఎల్వీఆర్ విద్యార్థినీలకు 'విప్రో కేర్' నిధులు మంజూరు

విశాలాంధ్ర - నరసన్నపేట: స్థానిక ఎల్వీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు విప్రో కేర్ సంస్థ అయిన సంతూర్ స్కాలర్ షిప్ నిధులు మంజూరు చేసిందని కళాశాల సెక్రటరీ, లక్ష్మీ ప్రసన్న తెలిపారు. మంగళవారం ఆమె విశాలాంధ్రతో మాట్లాడుతూ చదువు పట్ల ఆసక్తి ఉండి, వారి ఆర్థిక పరిస్థితులు కారణంగా చదువు మధ్యలో ఆపకుండా కొనసాగించేందుకు సంతూర్ స్కాలర్ షిప్ వారికి చేయూత నిస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో సంతూర్ స్కాలర్ షిప్‌కు సుమారు 45మంది విద్యార్థినులు ఎంపికయ్యారని, ఎంపికైన విద్యార్థినులు ఒక్కొక్కరికీ రూ.24,000చొప్పున్నా, మొత్తం రూ.10,80,000 విద్యార్థినుల బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యాయని అన్నారు. స్కాలర్ షిప్‌లకు ఎంపికైన విద్యార్థినులకు మూడు సంవత్సరాలు పాటు వారి బ్యాంక్ ఖాతాలకు నగదు వస్తుందని తెలిపారు. స్కాలర్ షిప్ పొందిన విద్యార్థినులు తమ విద్య అవసరాలకు ఈ నిధులను ఉపయోగించుకోవాలని, వారి తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎం.ప్రసాదరావు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం

మేజర్ పంచాయితీ సర్పంచ్ బురల్లి శంకరరావు

విశాలాంధ్ర - నరసన్నపేట: పట్టణంలో ప్రజానీకానికి త్రాగునీటి ఎద్దడి లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు అన్నారు. మంగళవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో ఆయన త్రాగునీటి బోర్ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేసి, నీటి ఎద్దడికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్, శంకరరావు మాట్లాడుతూ గతంలో మండలంలోని దేవాది గ్రామం సమీపంలో తీసిన రెండు బోర్లు విఫలం కావటంతో ఈ సమస్య తలెత్తిందని, యంత్రాల ద్వారా ఈ సమస్య పరిష్కారం కాదని, వర్కర్లే బోరు బావిలో ఉన్న వ్యర్థాలను తొలగించాలన్నారు. వచ్చే 9వ తేదీ నుండి బోరు బావి మరమ్మత్తులు చేయించి, పట్టణ ప్రజానీకానికి త్రాగునీరు అందిస్తామని అన్నారు. అంతవరకూ ప్రతీ రోజూ ఉదయం పూట మాత్రమే కొళాయి నీరు అందిస్తామని సర్పంచ్, బురల్లి శంకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ఈ.ఓ, పి.ద్రాక్షాయిణి, త్రాగునీటి కొళాయి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ: ఒకరికి గాయాలు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మెలియపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలల్లో చదువుతున్నా పదవ తరగతి విద్యార్థులు నిక్ నేమ్‌తో పిలవటంపై ఇద్దరు విద్యార్థుల మధ్య మంగళవారం మాట మాట పెరిగి భోజన విరామ సమయంలో ఇంటికి వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో కొట్టుకోవడంతో బందారు దినేష్ అనే విద్యార్థికి అదే గ్రామానికి చెందిన విద్యార్థి వివేక్ కర్రతో దినేష్ తలపై గట్టిగా కొట్టడంతో తలకు బలమైన గాయమైంది. గాయమైన దినేష్ మెళియాపుట్టి అరోగ్య కేంద్రానికి తరలించి, ప్రథమ చికిత్స అందించి అక్కడ నుంచి టెక్కలి జిల్లా అసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. పదవ తరగతి పరీక్షల దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇటువంటి పరిస్థితులు నిరోధించే క్రమంలో భాగంగా విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పోలీసులు సమన్వయంగా వ్యవహరించి భవిష్యత్తులో ఇటువంటి పరిణామాలు జరగకుండా మార్పువచ్చే దశగా కృషి చేస్తారని గ్రామస్తులు పలువురు ఎదురుచూస్తున్నారు.

మహారాజా మార్కెట్లో భారీ అన్నదానం

విశాలాంధ్ర-పొందూరు: పొందూరు మహారాజా మార్కెట్లో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బండార్లమ్మ తల్లి జాతర ముగించుకుని మంగళవారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో సంత మార్కెట్లో అన్న సమారాధన ఏర్పాటు చేయటంతో వేలాదిమంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని చిన్న బండారలమ్మ తల్లి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పల్లె పల్లె ప్రాంతాల నుండి కదలి వచ్చిన భక్తులకు ఆ ఆలయ కమిటీ సభ్యులు ప్రముఖ రచయిత గుడ్ల ప్రభాకర్ రావు, చనాపతి శ్రీనివాసరావు, గుడ్ల సాయి, గుంటుకు రాము, ముద్దం శెట్టి సత్తిబాబు, అనకాపల్లి సూరిబాబు, గుడిసా కార్తీక్, గుడ్ల ప్రదీప్ లతో కూడిన వర్తక బృందం భక్తులకు స్వాగతం పలికి చిన్న బండారులమ్మ తల్లి దర్శనం కల్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది కదిలి వచ్చిన అందరికీ అన్న ప్రసాదం అందించే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మహారాజా మార్కెట్లో బండర్లమ్మ తల్లికి జై జైలో పలుకుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో గ్రామానికి చెందిన యంగ్ స్టార్స్ యూత్ క్లబ్, లయన్స్ క్లబ్, వాకర్ క్లబ్స్, సత్యసాయి సేవా సమితి వంటి పలు ప్రజా సంఘాలు సేవలందించారు.

శ్రీ కళ్యాణి పాఠశాలలో ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండల కేంద్రం శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సైన్సు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టకుంది. ఈ కార్యక్రమాన్ని విశ్రాంత హెచ్ఎం వండి బలరామూర్తి ప్రారంభించగా ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం, డైజిటల్ సిస్టం, ప్రకృతి భూకంపాలు ఎల్కేజీ విద్యార్థులు చేసిన వివిధ ఫ్రూట్స్ యొక్క ప్రయోగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివరించిన ప్రయోగాలను వింటూ ఎంఈఓ ధనుంజయ మజ్జి, మాజీ జెడ్పిటిసి బి రమేష్, మాజీ సర్పంచులు పాండవ చంద్రశేఖర్, ఆరంగి మధు వేసిన ప్రశ్నలకు విద్యార్థులు చక చక సమాధానాలు చెప్తూ అందరిని ఆకట్టుకున్నారు. చిన్నప్పటి నుంచే ఇటువంటి సైన్స్ కార్యక్రమాలు పై విద్యార్థులకు అవగాహన కలిగించడం వల్ల విద్యార్థులలో మేధో శక్తి పెరుగుతుందని విశ్రాంత హెడ్మాస్టర్ బలరామమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ సంఘ సభ్యులు బెందాళం సురేష్, గిరిబాబు, శ్రీను, రమేష్, డిల్లేశ్వరరావు, పాఠశాల ఏవో రాణి, ప్రిన్సిపల్ బిందు మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో దుప్పలవలస విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: కోనసీమ జిల్లా అమలాపురంలో చిత్ర కళాపరిషత్ ఇటీవల ఆన్లైన్లో నిర్వహించిన అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీల్లో దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాలు/ కళాశాల విద్యార్థులు ప్రతిభకనబరిచారు. ఈ పోటీల్లో 121 మంది విద్యార్థులు పాల్గొనగా, ఇందులో 18 బంగారు, 13 మంది కేసీపీ అవార్డులను సాధించారు. అలాగే ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బాలచిత్ర అవార్డు సర్టిఫికేట్లను పంపిణీచేశారు. అదే విధంగా ప్రిన్సిపాల్ బి. బుచ్చిరాజు, డ్రాయింగ్ టీచర్ గొర్లె దుర్గారావులకు విశ్వగురు, బంగారు పతకాలను అందజేశారు. చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ బి. రాంబాబు అభినందించారు.

రూ.65.50 లక్షలతో కల్వర్టుల నిర్మాణం

విశాలాంధ్ర-పొందూరు: మండలంలో రూ. 65.50 లక్షలతో 5 కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. తోలాపిలో 3. కోటిపల్లి కూడలిలో రెండు కల్వర్టుల నిర్మాణలు ప్రారం భమయ్యాయి. తోలాపిలో కల్వర్టుల నిర్మాణంకోసం ఆర్అండ్ బీ ఏఈ పీటీ రాజు కొలత లను తీసుకున్నారు. కల్వర్టుల నిర్మాణం చేపట్టనుండడంతో ప్రయాణాలకు ఆటంకం కలుగకుండా ప్రత్యామ్నాయ మార్గలను ఏర్పాటుచేసినట్లు ఏఈ తెలిపారు. తోలాపి కల్వర్టు నిర్మాణం పనులను మాజీ ఏఎంసీ చైర్మన్ కూన సత్యనారాయణ తోలాపి నాయకులు పరిశీలించారు.

రక్షిత నీటి పథకాల పరిశీలన

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం కిన్నెరవాడ చీడిపూడి తొగిరి గ్రామంలో తాగునీటి సరఫరా చేస్తున్నారు రక్షిత నీటి పథకం ట్యాంకర్లను మంగళవారం పరిశీలించారు గ్రామాల ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుందా లేదా పూర్తి స్థాయిలో అందుతుందా లేదా అని ప్రజలను అక్కడ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు మరో 60 రోజులు ఎండలు తీవరంగా ఉంటా యని కనుక ఎక్కడైనా నీ తాగునీటి సమస్య ఉంటే సంబంధిత సచివాలయ అధికారులకి లేదా మండల స్థాయి అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలని ప్రజలకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎంపీడీవో పి వి వి మోహన్ కుమార్ అన్నారు.

రోడ్డు పనులు చేపట్టండి

విశాలాంధ్ర-జలుమూరు: రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితం ప్రవేశపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో వివిధ మారుమూల గ్రామాలకు సిసి రోడ్లు మరియు తారు రోడ్లు కు నిధులు మంజూరు చేసింది వీటి పనులను పూర్తి చేయాలని సారవకోట మండల అభివృద్ధి అధికారి పి వి వి మోహన్ కుమార్ అన్నారు. 20 లక్షల రూపాయలతో బుడితి మెయిన్ రోడ్డు నుండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వరకు నిర్మించిన సిసి రోడ్డు మంగళవారం పరిశీలించారు. ఇలాగే రోడ్ల పనులను వేగవంతం చేసి మండలానికి పేరు తేవాలని స్థానిక పాలకులకు గ్రామస్థాయి అధికారులకు సూచించారు ఆయనతో పాటు మృతి పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఆంగ్ల భాషా నైపుణ్యాలు అవసరం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: విద్యార్థి ఎదుగుదలకు ఆంగ్ల భాషా నైపుణ్యాలు అవసరమని విజయవాడ ఏ.ఎం.ఎం కళాశాల ఆంగ్ల ప్రొఫెసర్ బొడ్డపాటి చంద్రశేఖర్ అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్ మెంట్ కళాశాల ద్వితీయ భాషలు విభాగం ఏర్పాటు చేసిన గెస్ట్ లెక్చర్ కు ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఇంగ్లీష్ భాష అనేది నిరంతరం మార్పులుకు, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా మార్పులు చెందుతుందని, మంచి భవిష్యత్ కోసం భాషా నైపుణ్యాలు అవసరమని అన్నారు. విద్యార్థుల సందేహాలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. పులఖండం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యన్నారాయణ, ప్రముఖ రచయిత జె. శరత్ బాబు, ఐ.క్యూ.ఏ.సి సమన్వయకర్త డా. మార్తండ కృష్ణ, భమిడిపాటి గౌరిశంకర్, అప్పలనాయుడు, గోపాలరావు, హరేరామ్ తదితరులు పాల్గొన్నారు.

నూర్పులు వేయని ధాన్యం కుప్పల పరిశీలన

విశాలాంధ్ర-పొందూరు: మండలంలో నూర్పులు వెయ్యక పంట పొలాల్లో ఉన్న వరి కుప్పలను జిల్లా సరఫరాల అధికారి జి. సూర్యప్రకాశరావు మంగళవారం మండలంలోని కనిమెట్ట, కింతలి, తోలాపి, పెనుబర్తి,గోరింట, దల్ల వలస, కోటిపల్లి గ్రామాలలో పర్యటించి ముమ్మరంగా పరిశీలించారు. ఇటీవల ముమ్మరంగా ధాన్యం కొనుగోలు చేసిన తరువాత ఇంకా నిల్వలు ఏ ప్రాంతాల్లో ఉన్నాయో క్షేత్రస్థాయిలు పరిశీలన చేశారు. ధాన్యం కొనుగోలుకు ఇంకా మిగిలి ఉన్న దాన్యం కుప్పలు ఆయా పంట పొలాల్లో ఏ స్థాయిలో వరికుప్పలు ఉన్నాయో అలాగే నూర్చిన ధాన్యం నిల్వలతో పాటు పర్యవేక్షణలో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ సహాయకులు మరియు మండల వ్యవసాయ అధికారి బి.బాబ్జి పాల్గొన్నారు.

‘కూటమి’ ప్రభుత్వమే ఉపాధ్యాయ ఉద్యమానికి ‘చీలికలు’ తెచ్చింది

యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమే ఉపాధ్యాయ ఉద్యమానికి చీలికలు తెచ్చిందని యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్.కిషోర్‌కుమార్ విమర్శించారు. మంగళవారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంధర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి, కింజరాపు అచ్చెంనాయుడు యు.టి.ఎఫ్‌కు వైసిపి ముసుగు వేస్తూ చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ సంధర్భంగా రాష్ట్ర కార్యదర్శి, కిషోర్‌కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్‌కు వైసిపి ముసుగు వేయటం సరికాదని, వాస్తవానికి ఏపిటిఎఫ్, పిఆర్‌టియు అభ్యర్ధులకు కూటమి ముసుగు వేయటం ద్వారా అధికార పక్షమే, ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చిందని విమర్శించారు. కూటమి బహిరంగంగా మద్ధతు పలికిన అభ్యర్ధి ఓటమి, వారు విద్యా రంగంలో అనుసరిస్తున్న విధానాలకు చెంపపెట్టు అని ఇప్పటికైనా గ్రహించాలని కోరారు. ఈ ఎన్నికల్లో పి.డి.ఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని, దానికి యుటిఎఫ్ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ప్రజా సంఘాలు మద్ధతు తెలిపాయన్నారు. యు.టి.ఎఫ్ ఏ అధికార, ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా ఉండదని, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి పోరాటం చేసేటువంటి సంస్ధ అని తెలిపారు. అలాగే విద్యారంగాన్ని కాపాడే యుటిఎఫ్‌కు రాజకీయాలు అంటగట్టడం సరికాదన్నారు. ప్రతీదీ రాజకీయ కోణాల్లో చూసేవారికి మన ఎన్నికలను కూడా రాజకీయంగా మార్చిన వారికి యుటిఎఫ్‌ను చూడటం గర్హనీయమన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఈ ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన యుటిఎఫ్ స్థైర్యం దిగజారదని, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పట్ల పోరాటాన్ని కొనసాగిస్తునే ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చౌదరి రవీంద్ర, కోశాధికారి, బి.రవికుమార్, గౌరవ అధ్యక్షులు, కె.వైకుంఠరావు, బమ్మిడి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

...

ఐటీడీఏ పనులు వేగవంతం చేయాలి : పీవో

విశాలాంధ్ర-మందస: సీతంపేట ఐటిడిఏ పరిధిలో జరుగుతున్న పనులు వేగవంతంగా చేయాలని పి ఓ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మెలియాపుట్టి మండలం లోని ఎర్రమానుగూడ, సవర చీడిపాలెం, నందలపాడు గ్రామాల్లో చేపడుతున్న మల్టీపర్పస్ సెంటర్ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పనులను వేగవంతం చేయుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని అన్నారు. భవన నిర్మాణ పనులకు తెచ్చిన ఐరన్ మెటీరియల్, సిమెంట్ ఇటుకలను నాణ్యత టెస్ట్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మెలియాపుట్టి మండలంలోని భరణికోట బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి బాగా చదువుకొని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు అదే విధంగా ఉపాధ్యాయులతో సమా వేశం నిర్వహిం చారు. పదవ తరగతి విద్యార్థుల ప్రీ ఫైనల్ పరీక్ష ల్లో వచ్చిన మార్కులపై సమీక్ష నిర్వహించి పలు సూచ నలు చేశారు. అనం తరం కరజాడ పీహెచ్ సీని పరిశీ లించారు. ఈ సందర్భంగా పీహెచ్ సీలోని ఓపి రికార్డులను పరిశీలించారు. ప్రసవాలకు సంబంధించిన క్యాలెండర్ ను పరిశీలించారు. ఆసుపత్రిలో బయోవ్యర్థాలను లేకుండా చూసుకోవా లని అన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని అన్నారు.అదే విధంగా నందిగాం మండలంలోని సవర లింగుపురం ఆశ్రమ పాఠశాలలను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పబ్లిక్ పరీక్షలు దృష్ట్యా పలు సూచనలు అందించారు. అనంతరం పలాస మండలంలోని లొత్తూరు ఆశ్రమ పాఠశాలను పరిశీలి ంచారు. పాఠశాలలో ఉన్న తాగునీటి సమస్యలు పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటా మన్నారు.మందస మండలంలోని మందస పిహెచ్ సీని మంగళ వారం ఐటీడీఏ పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్ సీ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండాలని ఆసుపత్రిలో బయో వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని అన్నారు. వైద్య సి పీహెచ్ సీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం బుడంబో కాలనీ ఆశ్రమ పాఠశాలలో పరిశీలించారు. పది విద్యార్థులతో మాట్లాడారు. కిల్లోయి కాలనీ, పట్టులోగాం ఆశ్రమ పాఠశాలలను కూా పరిశీలించి పదవ తరగతి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలకు విజయవంతం చేయండి

న్యాయమూర్తి ప్రసన్నలత

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : రాబోయే ఎనిమిదో తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసి విజయవంతం చేయాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్ ప్రసన్నలత కోరారు. కోర్టు ఆవరణలో మంగళవారం న్యాయవాదులు, పోలీసు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అలాగే ముందస్తు లోకదాలత్ కూడా నిర్వహించారు. ఈ ముందస్తు లోకదాలత్ లో రెండు సివిల్ ధావాలు అదేవిధంగా ఒక మనోవర్తి కేసు, నాలుగు క్రిమినల్ కేసులు రాజీ అయ్యాయి. న్యాయమూర్తి మాట్లాడుతూ ముందస్తు లోకదాలత్ నిర్వహించడం వల్ల, జాతీయ లోక్ అదాలత్ రోజునే ఎక్కువ మందికి ప్రజలకు లేదా కక్షి దారులకు ఇబ్బంది జరగదని ఇదేవిధంగా ఈ ముందస్తు లోక్ అదాలత్ లో రాజీ చేసిన కేసులు అన్నిట్లో శనివారం నాడు జరగబోయే జాతీయ లోకదాలత్ లో అవార్డులను పాస్ చేస్తామని న్యాయమూర్తి తెలిపారు. సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టు వారి ఆదేశాలపై ఏ కేసులు కూడా లోక్ అదాలత్ లో రాజీ అయ్యేటప్పుడు ఆ కేసులలో పార్టీల గుర్తింపు (ఐడెంటిఫికేషన్) కోసం వారి పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను లోకదాలత్ న్యాయమూర్తి ముందు రాజీ పత్రములతో పాటు సమర్పించవలసి ఉంటుం దని, ఈ విషయాన్ని న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కక్షిదారులు గుర్తించి రాజీకై న్యాయ స్థానానికి వచ్చేటప్పుడు వారి పాస్పోర్ట్ సైజ్ ఫోటోలను, ఆధార్ కార్డు కాపీలను తమతో పాటు తీసుకురావాలని తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు వై. వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ బి.నారాయణరావు, పలువురు సీనియర్ న్యాయవాదులు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు, నౌపడ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కక్ష సాధింపు రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం

- ఇచ్చిన హామీలు అమలు లో కూటమి విఫలం

- వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ప్రజల ఓట్ల కోసం మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల నెరవేర్చడం మాని కక్ష పూరిత రాజకీయాలకు ప్రాదాన్యత ఇస్తుందని మాజీ రాష్ట్ర మంత్రి, వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. మంగళవారం జిల్లా పర్యటన కు వచ్చిన ఆయన స్థానిక పెద్దపాడు వద్ద నున్న వైసీపీ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబద్దాలతో ప్రజలను మోసం చెయ్యడం లో చంద్రబాబు దిట్ట అని మరో సారి నిరూపితం అయ్యిందని 9 నెల ల కూటమి పాలనలో ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదన్నారు. తెలిసి తెలిసి ప్రజలు చంద్రబాబు నాయుడు ను అధికారం లోకి తెచ్చారన్నారు. ప్రతిపక్ష పార్టీ కి ఓటు వేసిన వర్గాలకు సంక్షేమ పథకాలేవి అమలు చేసేది లేదంటూ బహిరంగంగా ప్రకటించిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కులాలు, మతాలు, పార్టీ లు అంటూ తారతమ్యం లేకుండా మాట తప్పని మడమ తిప్పని నేత ఎవరైనా ఉన్నారంటే అది జగన్మోహన్ రెడ్డి అని, పేద, మధ్యతరగతి సంక్షేమమే అజెండాగా వైసిపి గత పాలన నిదర్శనం అన్నారు. ఇప్పటికే కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, దాన్ని పక్కదారి పట్టించేందుకు రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసిపి ప్రతి కార్యకర్తకు, పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కూటమి పాలన లో బాధితులకు అండగా ఉంటానని, వారి బెదిరింపు లకు భయపడేదే లేదన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా చెప్పుకున్న రఘువర్మ ఓటమి కూటమి పాలనపై అన్ని వర్గాల వారు వ్యతిరేకంగా ఉన్నారనడానికి నిదర్శనం అన్నారు. రఘువర్మ గెలుపుకు అహర్నిశలు కృషిచేసిన కూటమి పెద్దలు అతని వాటమి తరువాత ఆయనకు మేము మద్దతు ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి దుర్మార్గ పాలన ఎండగడుతూ ప్రజల పక్షాన నిలబడుతూ వైసీపీ పనిచేస్తుందన్నారు. కూటమి కుటిల రాజకీయాలకు, కక్షపూరిత రాజకీయాలకు భయపడేది లేదని సామాన్య కార్యకర్తకు సైతం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, మంత్రి దాక్టర్ సీదిరి అప్పలరాజు, జడ్పీ చైర్ పిరియా విజయ, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి జయంతి, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, యువజన విభాగం నాయకుడు మెంటాడ స్వరూప్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైవభంగా ప్రారంభమైన శ్రీ షిరిడి సాయి ఆలయం ప్రతిష్ట

విశాలాంధ్ర సంతబొమ్మాళి: సంతబొమ్మాళి లో నూతనంగా నిర్మించిన శ్రీ షిరిడి సాయి బాబా ఆలయం ప్రతిష్ట మహోత్సవం మొదటి రోజు కార్యక్రమం మంగళవారం వైవభంగా ప్రారంభమైంది. సాయి పూజ్య గురువులు అమ్ముల సాంబ శివరావు ఆధ్వర్యంలో సాయి గురువులు ఈ కార్యక్రమం ను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం రక్షా బంధనం, అంకురారోపనం, అఖండ దీపారాధన, సర్వతోభద్ర నవగ్రహారాధన, జలాధివాసం, ధాన్యాదివాసం, సాయి కోటి నామాల పుస్తకం నిక్షిప్తం తదితర కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. సాయంత్రం సాయి మందిరం నుంచి పురవీధులలో భక్తులు ఊరేగింపు జరిపి అనంతరం ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అంటూ అఖండ సాయి నామ సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి సాయి భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి సేవకులు వీర్రాజు సాయి తో పాటు పలువురు సాయి సేవకులు పాల్గొన్నారు.

పాఠశాలకు సిమెంట్ బెంచీల వితరణ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : తాను పనిచేస్తున్న పాఠశాల లో విద్యా బోధనకే పరిమితం కాకుండా పాఠశాలకు సిమెంట్ బెంచీ మరియ కుర్చీలు వితరణ గా ఇచ్చి ఆదర్శంగా నిలిచింది ఒక ఉపాధ్యాయిని. ఆమె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , బోరుభద్ర లో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయిని జి.జగదాంబ. 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా సిమెంట్ బెంచీలను ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగదాంబ వంటి వారిని ఆదర్శంగా తీసుకుని పాఠశాల అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వివిధ స్థాయిలలో స్థిరపడిన పాఠశాల పూర్వ విద్యార్థులు, దాతలు పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయిని జి.జగదాంబ ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో తమ పిల్లలు పరీక్షల కొరకు సన్నద్ధత కావడంలో తల్లిదండ్రులు పాత్ర గూర్చి ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, ఉపాధ్యాయులు, టి.లోకేశ్వర రావు, డి.ఉమా శంకర్, వెంకట రెడ్డి, కె.త్రినాధ రావు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయ లక్ష్మి, బి.నాగమణి, కె.తవిటి రెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతి రావు, శంకర రావు, గోపాలరెడ్డి, కమల కుమారి, సుశీల దేవి, సాయి శివాని, కృష్ణ, త్రివేణి పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేద్దాం

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

పార్టీ శ్రేణులకు ప్రముఖ వైద్యులు జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: అందరమూ కలసికట్టుగా పనిచేసి జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేద్దామని జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రూరల్ మండలం పరిధిలోని కొత్తరోడ్డు జంక్షన్‌లోని శాంతి కన్వెక్షన్‌లో జనసేన పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్త కొరికాన రవికుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించిందన్నారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలో నిలిపిన 21 మంది అభ్యర్థులు ఘన విజయం సాధించారని చంద్రబాబు సారథ్యంలో కొలువు తీరిన ప్రభుత్వంలో ఆ పార్టీ కీలక భాగస్వామి అయిందని వివరించారు. అలాంటి వేళ.. మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా, పార్టీకి మరింత పటిష్టం చేస్తూ ఈ ఆవిర్భావ వేడుకలు నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, టెక్కలి, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తలు కణితి కిరణ్ కుమార్స్, పెడాడ రామ్మోహన్, వీరమహిళలు,జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని ముత్యాల పేట దరిలో గల వడ్డిపుట్టుగ గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వి. రవివర్మ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎరుసూరి సోనియా (27) అనే మతిస్థిమితం లేని మహిళ తన నివాసంలో ఫ్యాన్ కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది. మృతురాలు సోనియాకు ఇటీవల పెండ్లి సంబంధం కుదిరిందని మే నెలలో పెళ్లి చేసేందుకు సిద్ధమైనట్లు మృతురాలు తండ్రి ఆనందరావు కన్నీటి పర్యంతం అవుతూ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

భూసార పరీక్షలతో నేలకు మేలు

విశాలాంధ్ర-సోంపేట: భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా నేలకు అవసరమైన ఎరువులు యాజమాన్యం పాటించి నప్పుడు ఆ నేలకు మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జగన్మోహనరావు పేర్కొన్నారు. సోంపేట మండలం బారువ రైతు సేవా కేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తితో కలిసి రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సిఫార్సు మేరకు ఎరువులు వాడి సాగు ఖర్చు తగ్గించుకోవాలని అన్నారు. దీని వల్ల భూసార పరిరక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పవిత్ర, లోలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబును కలిసిన మండల వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబును కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల వైసీపీ నాయకులు మంగళవారం శ్రీకాకుళంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శలువ కప్పి సత్కరించారు. టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ తో కలిసి వారంతా రెండు మండలాల్లో పార్టీ పరిస్థితిని వివరించినట్టు తెలిపారు. తమకు ఎదురవుతున్న సమస్యలు కన్నబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. పార్టీ పూర్వ వైభవానికి అంతా శ్రమించి కృషి చేయాలని ఆయన కోరినట్లు వైసిపి శ్రేణులు తెలిపాయి. కన్నబాబును కలిసిన వారిలో కోటబొమ్మాళి ఎంపీపీ రోనంకి ఉమా మల్లయ్య, జడ్పిటిసి డి. వెంకట రమణారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్. హేమ సుందర రాజు, సీనియర్ నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, ఎన్ని మన్మధ రావు, నక్క భీమారావు, తదితరులు ఉన్నారు.

106 మందికి ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : కోటబొమ్మాళి శ్రీ సత్య సాయి బాబా మందిరం వద్ద సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 16 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 42 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గీతాంజలి, సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్య సాయి సేవ సమితి ప్రతినిధులు ఆనందరావు, అనాధి గుప్త, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతి ద్వారా గిరిజనులకు ఉత్తమ ప్రయోజనం : ఏపిఎం కూర్మారావు

విశాలాంధ్ర-మందస: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని షెడ్యూల్డు కులాలు, తెగలలో వెనుకబడిన కుటుంబాల జీవనోపాదులను మెరు గు పరచడానికి అమలు చేస్తున్న ఉన్నతి పథకం ను సక్రమముగా వినియోగించు కోవడం గిరిజనులకు ఎంతో ఉత్తమము అని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మంగళవారం కుసుమలా పంచాయితీ గ్రామ సంఘం పాలకవర్గ సమవేశం లో పాల్గొని మాట్లాడారు. పంచసూత్రాలు పాటిస్తూ,అర్హత కలిగిన గిరిజన ప్రాంతంలో సంఘాలకు గతంలో ఇచ్చిన అప్పులకు కరెక్టుగా రిపేమెంట్ లేనందునే ,మళ్ళీ వడ్డీ లేని ఉన్నతి రుణాలు పొందడానికి మీరు అంతా అనర్హులు అయ్యారు అని అవగాహన కల్పించారు. పొడుపులో ఉన్న నిల్వలను మీటింగ్ పెట్టి అవసరమైన సభ్యులకు అప్పులు ఇవ్వనందునే మీ లో ఎక్కువ మంది మైక్రో ఫైనాన్స్ సంస్థల ద్వారా అధిక వడ్డీలుకు డి.సీ.(డైలీ కలెక్షన్) అప్పులు వాడుకోవలసిన దుస్థితి నెలకొంది అని అవగాహన కల్పిస్తూ, అర్హులందరికీ బ్యాంకు, గ్రామసంఘం స్త్రీ నిధి ఋణాలు మంజూరు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం గిరిజన జీడి రైతుల కోసం పెట్టిన వన్ దన్ వికాస కేంద్రం నకు మీ పరిధిలో గల జీడి పిక్కలను అందరూ ఇచ్చి ప్రాసెసింగ్ చేయించుకొని తద్వారా లబ్ధి పొందాలని సూచించారు.ఈ కార్యక్రమం లో వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామినాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు తో పాటు కుసుమల, కొండలోగాం వి.ఓ.ఏలు జగబందు, ఆనంద్ ,గ్రామసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.